ఒక ఓవర్‌లో 39 పరుగులు

టీ20ల్లో సరికొత్తప్రపంచ రికార్డునమోదు • యువరాజ్‌సింగ్ ఆరు సిక్సర్ల ఫీట్ బద్దలు • సమోవా బ్యాటర్ డేరియస్ విధ్వంసం

న్యూఢిల్లీ: ధనాధన్‌కు మారుపేరైన టీ20ల్లో మరో రికార్డు బద్దలైంది. టీ20 ప్రపంచకప్ క్వాలిఫయింగ్‌లో భాగంగా ఈస్ట్-ఆసియా పసిఫిక్ రిజీయన్ క్వాలిఫయర్‌లో వనువాటుపై సమోవా బ్యాటర్ డేరియస్ విస్సర్(62 బంతుల్లో 132, 5ఫోర్లు, 14సిక్స్‌లు) వీర విధ్వంసం సృష్టించాడు. మంగళవారం ఏపియాలో జరిగిన టీ20 పోరులో విస్సర్..వనువాటు బౌలర్ నలిన్ నిపికోను లక్ష్యంగా చేసుకుంటూ ఒకే ఓవర్‌లో ఏకంగా 39 పరుగులు కొల్లగొట్టాడు. బంతిపై కక్ష్య కట్టినట్లు పిచ్‌పై పడటం ఆలస్యమన్న తరహాలో భారీ సిక్స్‌లతో హోరెత్తించాడు. నిపికో బౌలింగ్‌ను చీల్చిచెండాడుతూ విస్సర్ కొట్టిన సిక్స్‌లు మ్యాచ్‌కు హైలెట్‌గా నిలిచాయి. ఒకే ఓవర్‌లో విస్సర్ ఆరు బంతుల్లో ఆరు భారీ సిక్స్‌లు కొట్టగా.. మూడు నో బాల్స్ రూపేనా మూడు పరుగులు జతకలిశాయి. దీంతో అంతర్జాతీయ టీ20ల్లో ఒకే ఓవర్‌లో అత్యధిక పరుగుల రికార్డుతో పాటు ఆరు బంతుల్లో ఆరు సిక్స్‌ల ఫీట్‌ను కూడా విస్సర్ తన పేరిట లిఖించుకున్నాడు. ఈ క్రమంలో భారత దిగ్గజ ఆల్‌రౌండర్ యువరాజ్‌సింగ్‌తో పాటు కీరన్ పొలార్డ్, దీపేంద్రసింగ్ సరసన డేరియస్ నిలిచాడు. న్యూసౌత్‌వెల్స్(ఆస్ట్రేలియా)లోని హైప్ క్రికెట్ అకాడమీలో శిక్షణ పొందిన విస్సర్..వనువాటుపై పిడుగులా పడ్డాడు. తన కెరీర్‌లో మూడో టీ20 మ్యాచ్ ఆడిన విస్సర్ విజృంభణతో సమోవా నిర్ణీత 20 ఓవర్లలో174 పరుగులు చేసింది. కెప్టెన్ జస్మత్ (16)..విస్సర్ తర్వాత టాప్‌స్కోరర్‌గా నిలువగా, మిగతావారు సింగిల్ డిజిట్ స్కోర్లకు పరిమిత మయ్యారు. ఆ తర్వాత లక్ష్యఛేదనలో వనువాటు 20 ఓవర్లలో 9 వికెట్లకు 164 పరుగులు చేసింది. ఓపెనర్ నిపికో(73), జోషువ రసు(23), టిమ్ కట్లర్(21) రాణించినా 10 పరుగుల తేడాతో ఓటమి వైపు నిలిచారు. ధనాధన్ ఇన్నింగ్స్‌తో జట్టు విజయంలో కీలకమైన విస్సర్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

డేరియస్ (132, 5 ఫోర్లు 14 సిక్స్‌లు)

టీ20ల్లో సిక్సర్ల వీరులు

యువరాజ్‌సింగ్	ఇంగ్లండ్‌పై	2007
కీరన్ పొలార్డ్	శ్రీలంకపై	2021
దిపేంద్రసింగ్	ఖతార్‌పై	2024

'ఐరన్‌మ్యాన్' హరీశ్

3.8కి.మీ స్విమ్మింగ్, 180కి.మీ సైక్లింగ్ 42.2కి.మీల మారథాన్‌లో అగ్రస్థానం

భారత సైనికుని అరుదైన ఘనత

న్యూఢిల్లీ: శత్రుమూకల నుంచి దేశ సరిహద్దులను కాపాడటంలోనే కాదు..క్రీడల్లోనూ తమకు తామే సాటి అని భారత సైనికులు మరోమారు నిరూపించారు. ప్రపంచంలోనే అత్యంత కఠిన పరీక్షగా పేరొందిన ఐరన్‌మ్యాన్ ట్రయథ్లాన్‌లో బీఎస్ఎఫ్‌కు చెందిన హరీశ్ కజ్లా కొత్త చరిత్ర లిఖించాడు. డెన్మార్క్ రాజధాని కోపెన్‌హగన్ వేదికగా జరిగిన ఐరన్‌మ్యాన్ ట్రయథ్లాన్ ఈ 35 ఏండ్ల అధికారి అగ్రస్థానంలో నిలిచి ఔరా అనిపించాడు. తద్వారా ఈ ఘనత సాధించిన తొలి సీఏపీఎఫ్(సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్) అధికారిగా హరీశ్ అరుదైన రికార్డు సొంతం చేసుకున్నాడు. హరీశ్ సాధించిన చిరస్మరణీయ విజయాన్ని బీఎస్ఎఫ్ తమ అధికారిక ఎక్స్‌లో పోస్ట్ చేసింది. 'కోపెన్‌హగన్‌లో జరిగిన ఐరన్‌మ్యాన్ ట్రయథ్లాన్‌ను విజయవంతంగా పూర్తి చేయడం

ద్వారా హరీశ్..భారత భద్రతా దళాలకు మరింత విశిష్టత తీసుకొచ్చారు'అని రాసుకొచ్చింది. ట్రయథ్లాన్‌లో 3.8కి.మీల స్విమ్మింగ్, 180కి.మీల సైక్లింగ్, 42.2కి.మీల ఫుల్ మారథాన్‌ను హరీశ్ 12:42:25 టైమింగ్‌తో పూర్తి చేసి అగ్రస్థానంలో నిలిచాడు. అరుదైన ఫీట్ సాధించిన తర్వాత కజ్లా..జాతీయజెండాతో పాటు బీఎస్ఎఫ్, ఎన్ఎస్‌జీ జెండాలతో విజయాన్ని తనివితీరా ఆస్వాదించాడు.

జ్ఞానదత్ కెప్టెన్సీలో భారత్

• ఆసియా జూనియర్ బ్యాడ్మింటన్ టోర్నీ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: చెంగ్డు(చైనా) వేదికగా జరుగుతున్న ఆసియా జూనియర్ బ్యాడ్మింటన్ టోర్నీలో తెలంగాణ యువ షట్లర్ టీటీ జ్ఞానదత్..భారత జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఈ నెల 25 వరకు జరుగనున్న టోర్నీ కోసం జాతీయ బ్యాడ్మింటన్ సమాఖ్య(బాయ్) ఇటీవలే సబ్‌జూనియర్, జూనియర్ జట్లను ప్రకటించింది. తెలంగాణ నుంచి జ్ఞానదత్‌తో పాటు శశాంక్ వనమాల(అండర్-15), తన్వీరెడ్డి(అండర్-17), శౌర్యకిరణ్, కీర్తి(అండర్-17 మిక్స్‌డ్ డబుల్స్) ఎంపికయ్యారు. భారత అండర్-17 జట్టుకు జ్ఞానదత్ నాయకత్వం వహించడం తెలంగాణకు గర్వకారణమని రాష్ట్ర బ్యాడ్మింటన్ సంఘం ప్రధాన కార్యదర్శి పుల్లెల గోపీచంద్ పేర్కొన్నారు.

యూఏఈలో టీ20 ప్రపంచకప్

దుబాయ్: తీవ్ర ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో మహిళల టీ20 ప్రపంచకప్ టోర్నీ వేదిక బంగ్లాదేశ్ నుంచి యూఏఈకి మారింది. ఈ విషయాన్ని ఐసీసీ మంగళవారం అధికారిక ప్రకటనలో పేర్కొంది. అక్టోబర్ 3 నుంచి 20 వరకు బంగ్లాలో జరుగాల్సిన ఈ మెగాటోర్నీలో ఆడేందుకు సభ్యదేశాల క్రికెట్ బోర్డులు ససేమిరా అనడంతో ఐసీసీ ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. 'ప్రస్తుతమున్న పరిస్థితుల్లో బంగ్లాదేశ్‌లో టీ20 ప్రపంచకప్ నిర్వహణ సాధ్యం కాదు. అక్కడ ఆడేందుకు క్రికెటర్లు, ఆయా దేశాల బోర్డులు ఆసక్తి చూపించడం లేదు. ఈ కారణంగాయూఏఈకి మార్చాల్సి వచ్చింది' అని ఐసీసీ సీఈవో జెఫ్ అలార్డైస్ పేర్కొన్నాడు. ఇదిలా ఉంటే ఐసీసీ చైర్మన్ పదవి రేసులో బీసీసీఐ కార్యదర్శి జై షా ముందు వరుసలో ఉన్నాడు.

క్రీడలతో అందమైన జీవితం

డబుల్ ఒలింపియన్ మను భాకర్

చెన్నై: పారిస్ ఒలింపిక్స్‌లో రెండు పతకాలతో కొత్త చరిత్ర లిఖించిన యువ షూటర్ మను భాకర్..తన విజయాన్ని ఆస్వాదిస్తున్నది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు గెలిచిన తొలి భారత ప్లేయర్‌గా అరుదైన ఘనత సొంతం చేసుకున్న భాకర్ ఎక్కడికి వెళ్లినా అపూర్వ ఆదరణ దక్కుతున్నది. మంగళవారం చెన్నైలో వేలామ్మాల్ నెక్సస్ స్కూల్ నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో భాకర్ ముఖ్య అతిథిగా పాల్గొంది. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశిస్తూ భాకర్ మాట్లాడుతూ 'టోక్యో ఒలింపిక్స్‌తో నా షూటింగ్ ప్రయాణం మొదలైంది. ప్రపంచ రెండో ర్యాంకర్ షూటర్‌గా పోటీకి దిగిన నేను స్థాయికి తగ్గట్లు రాణించలేకపోయాను. ఓడిపోవడానికి, గెలువడానికి ఉన్న తేడా ఏంటో నాకు తెలుసు. ఇది క్రీడల్లో ఉన్న అద్భుతం. ఒకసారి ఓడితే మరో సారి గెలువచ్చు. కానీ అదంతా మనం పడే కష్టంపైనే ఆధారపడి ఉంటుంది. క్రీడలను కెరీర్‌గా ఎంచుకోండి. కలలు సాకారం చేసుకోవాలంటే అందుకు బాగా కష్టపడాలి. మనకు కెరీర్‌లో చాలా ఆప్షన్స్ ఉన్నాయి. క్రీడల్లో అద్భుతమైన జీవితం ఉంది. ఆర్థిక మద్దతుతో పాటు అన్ని రకాలు మనం క్రీడల ద్వారా పొందవచ్చు. ఈ రోజు నేను ఈ స్థాయిలో ఉండటానికి నా తల్లే కారణం. ఆమె ఇచ్చిన ప్రోత్సాహం మరువలేనిది. ఎవరైనా ఏదైనా సాధించాలంటే ఇంట్లో తల్లిదండ్రులు, స్కూల్‌లో టీచర్ల మద్దతు తప్పనిసరిగా కావాలి' అని అంది.

అశ్మిత, మాళవిక నిష్క్రమణ

యోకోహమా(జపాన్): జపాన్ ఓపెన్‌లో భారత షట్లర్లు అశ్మిత చాలిహా, మాళవిక బన్సోడ్ పోరాటం ముగిసింది. మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి పోరులో అశ్మిత 16-21, 12-21తో తై జు యింగ్(చైనీస్ తైపీ) చేతిలో ఓటమిపాలైంది. ఏ దశలోనూ తైజుకు పోటీనివ్వలేకపోయిన అశ్మిత వరుస గేముల్లో మ్యాచ్‌ను చేజార్చుకుంది. మరో పోరులో మాళవిక 21-23, 19-21తో పొలినా బుహ్రోవా(ఉక్రెయిన్)పై పోరాడి ఓడింది. వీరిని అనుసరిస్తూ ఆకర్షి కశ్యప్ 13-21, 12-21తో కిమ్ గ ఉన్(కొరియా)పై పరాజయం పాలైంది.

ఐఆర్ఎఫ్‌లో హైదరాబాద్ బ్లాక్‌బర్డ్స్

• నాగచైతన్య సారథ్యంలో బరిలోకి

హైదరాబాద్, ఆట ప్రతినిధి: రేసింగ్ అభిమానులు అలరించేందుకు మరో లీగ్ మనముందుకు రాబోతున్నది. ఇండియన్ రేసింగ్ ఫెస్టివల్(ఐఆర్ఎఫ్)లో భాగంగా ఈ నెల 23 నుంచి మద్రాస్ ఇంటర్నేషనల్ సర్క్యూట్‌లో లీగ్‌కు తెరలేవబోతున్నది. దేశంలోని ఆరు ప్రధాన నగరాల సమాహారంగా పోటీలు జరుగనున్నాయి. హైదరాబాద్ బ్లాక్‌బర్డ్స్ జట్టు ప్రముఖ టాలీవుడ్ హీరో అక్కినేని నాగచైతన్య నేతృత్వంలో బరిలోకి దిగుతున్నది. రేసింగ్ లీగ్‌లో హైదరాబాద్‌తో పాటు బెంగళూరు, చెన్నై, ఢిల్లీ, గోవా, కోల్‌కతా ప్రధాన పోటీదారులు. ఈసారి లీగ్‌కు నాగచైతన్య, అర్జున్‌కపూర్, సౌరవ్ గంగూలీ, జాన్ అబ్రహం రూపంలో మరింత సెలెబ్రిటీ లుక్ రాబోతున్నదని ఆర్‌పీపీఎల్ ఎండీ, చైర్మన్ అఖిలేశ్‌రెడ్డి పేర్కొన్నారు. దేశంలో యువ రేసర్లను ప్రోత్సహించడంతో పాటు రేసింగ్ అభివృద్ధిలో భాగంగా తాను లీగ్‌లో భాగమైనట్లు నాగచైతన్య తెలిపాడు.

సిన్సినాటీ చాంప్ సిన్నర్

మాసన్(యూఎస్ఏ): యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ సన్నాహకమైన సిన్సినాటీ ఓపెన్‌లో టాప్ ర్యాంకర్ జానిక్ సిన్నర్ టైటిల్ విజేతగా నిలిచాడు. మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్ తుది పోరులో సిన్నర్ 7-6(4), 6-2తో ఫ్రాన్సిస్ టియాఫోపై అలవోక విజయం సాధించాడు. అండీ ముర్రే(21 ఏండ్లు) తర్వాత పిన్న వయసులో టైటిల్ గెలిచిన రెండో ప్లేయర్‌గా సిన్నర్(23 ఏండ్లు) నిలిచాడు. మరోవైపు మహిళల సింగిల్స్ తుదిపోరులో అర్యనా సబలెంకా 6-3, 7-5తో జెస్సికా పెగులాపై గెలిచి తొలిసారి టైటిల్‌ను ముద్దాడింది. భుజం గాయం కారణంగా వింబుల్డన్‌కు దూరమైన సబలెంకా.. ఈ విజయంతో యూఎస్ ఓపెన్‌లో టైటిల్ ఫెవరేట్‌గా పోటీపడనుంది.

ఈ నెల 25న హైదరాబాద్ మారథాన్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ప్రతిష్ఠాత్మక హైదరాబాద్ మారథాన్‌కు రంగం సిద్ధమైంది. నగరం వేదికగా ఈనెల 25న జరిగే హైదరాబాద్ మారథాన్‌లో 25,500కు పైగా రన్నర్లు పోటీపడుతున్నారు. ఇందులో భారత్‌తో సహా 17 దేశాలకు చెందిన అథ్లెట్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. హైదరాబాద్ రన్నర్స్ సొసైటీ, ఎన్ఎమ్‌డీసీ సహకారంతో జరుగుతున్న 13వ ఎడిషన్ కోసం నిర్వహకులు భారీ ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే వరల్డ్ అథ్లెటిక్స్ లేబుల్ రేసుగా గుర్తింపు పొందిన హైదరాబాద్ మరథాన్‌లో భాగంగా మంగళవారం జెర్సీ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఇందులో భారత స్టార్ బాక్సర్ నిఖత్ జరీన్ ముఖ్య అతిథిగా హాజరైంది. జెర్సీతో పాటు పతకాలు ఈ సందర్భంగా విడుదల చేశారు. ఈ నెల 24న హైటెక్స్‌లో 5కే రన్‌తో మారథాన్ సందడి మొదలుకానుంది. ఈనెల 25న ఫుల్ మారథాన్, హాఫ్ మారథాన్, 10కే రన్ జరుగనున్నాయి.

దీపావళికి లక్కీభాస్కర్

మహానటి, సీతారామం సినిమాలతో తెలుగు హీరో అయిపోయారు దుల్కర్ సల్మాన్. మలయాళంతో సమానంగా తెలుగులోనూ స్టార్‌డమ్‌ను సొంతం చేసుకున్నారాయన. ప్రస్తుతం దుల్కర్ చేస్తున్న తెలుగు సినిమా 'లక్కీభాస్కర్'. వెంకీ అట్లూరి దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 80శాతం నిర్మాణం పూర్తి చేసుకున్న ఈ సినిమాను సెప్టెంబర్ 7న విడుదల చేయాలని నిర్మాతలు మొదట్లో భావించారు. అయితే.. ఇప్పుడు అక్టోబర్ 31న దీపావళి కానుకగా విడుదల చేయాలని నిర్ణయించారు. మంగళవారం దీనికి సంబంధించిన ప్రకటన విడుదల చేశారు. పోస్ట్ ప్రొడక్షన్‌కి అదనపు సమయం పడుతుందని, అందుకే విడుదల తేదీని మార్చాల్సి వచ్చిందని, నాణ్యత విషయంలో రాజీ పడకూడదన్న ఉద్దేశంతోనే విడుదలను మరో నెలరోజులు వాయిదా వేశామని, కళాదర్శకుడు బంగ్లాన్ నిర్మించిన 80ల నాటి ముంబై సెట్, నిమిష్ రవి కెమెరా పనితనం, నవీన్‌నూలీ ఎడిటింగ్ ఈ సినిమాకు హైలైట్స్‌గా నిలువనున్నాయని మేకర్స్ చెబుతున్నారు. ఇందులో మీనాక్షి చౌదరి కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే.

ఎలాంటి డ్రగ్ టెస్టుకైనా సిద్ధం

హైదరాబాద్, ఆగస్టు 20 (నమస్తే తెలంగాణ) : ఎలాంటి డ్రగ్ టెస్టుకైనా తాను సిద్ధంగా ఉన్నట్లు సినీ నటి హేమ తెలిపారు. తనపై నిషేధం ఎత్తివేయాలని, తనని నిర్దోషిగా గుర్తించాలని కోరుతూ మంగళవారం హేమ ఓ వీడియో విడుదల చేశారు. ఆ వీడియోలో హేమ మాట్లాడుతూ.. '35 ఏండ్లుగా నేను సంపాదించుకున్న పరువును భూస్థాపితం చేశారు. నేను కొన్ని టెస్టులు చేయించుకున్నా. అన్నింటిలోనూ నెగిటివ్ వచ్చింది. అనుమానం ఉన్నవారికి చూపించాను. ఈ వీడియో చేయడానికి ప్రధాన కారణం ఒక్కటే.. నేను ఎలాంటి టెస్టులకైనా బహిరంగంగా రెడీ. అది మీ ముందు చెప్పడానికి ఈ వీడియో చేస్తున్నాను. అలాగే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అపాయింట్‌మెంట్ కోసం ఈ వీడియో చేస్తున్నాను. ఇన్నాళ్లూ నన్నొక తీవ్రవాదిలా చూశారు. నన్ను ఎంతో మంది మీడియా వాళ్లు బ్లాక్ మెయిల్ చేశారు. సెటిల్మెంట్‌కు రమ్మని ఫోర్స్ చేశారు. నాకు మీడియాకు గొడవలు లేవు. నేనెందుకు రావాలి. నేను ఏ తప్పూ చేయలేదు. నన్ను ఎవరెవరు బ్లాక్ మెయిల్ చేస్తున్నారో వారందరి నంబర్లు ఉన్నాయి. ఆ నంబర్లన్నీ తొందర్లోనే అప్‌డేట్ చేస్తాను' అంటూ ముగించారు.

యూత్‌ఫుల్ రాజావారు

నితిన్ కథానాయకుడిగా నటించిన మూడవ చిత్రం 'శ్రీశ్రీశ్రీ రాజావారు'. సంపద కథానాయిక. 'శతమానం భవతి' ఫేం వేగేశ్న సతీశ్ దర్శకుడు. చింతపల్లి రామారావు, ఎం.సుబ్బారెడ్డి నిర్మాతలు. దసరా కానుకగా విడుదల కానుంది. యూత్‌ఫుల్ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా వేగేశ్న సతీశ్ ఈ సినిమాను తెరకెక్కించారని, కచ్చితంగా నార్నె నితిన్ కెరీర్‌లో హ్యాట్రిక్ హిట్‌గా నిలుస్తుందని నిర్మాతలు తెలిపారు. రావు రమేశ్, నరేశ్, రఘు కుంచె, ప్రవీణ్, మచ్చ రవి, సరయు, రమ్య తదితరులు ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: దాము నర్రావుల, సంగీతం: కైలాష్ మీనన్.

చిత్రం

కాలంతో ప్రయాణించే ప్రియుడు

ప్రేక్షకులకు ఆసక్తిని కలిగించే కథల్లో టైమ్ ట్రావెల్ నేపథ్యంలోని కథలు ముందు వరుసలో ఉంటాయి. 'ఆదిత్య 369' నుంచి సౌత్ సినిమాలో ఈ తరహా కథలు అడపా దడపా పలకరిస్తూనే ఉన్నాయి. త్వరలో 'LIK' పేరుతో ఓ టైమ్ ట్రావెల్ మూవీ రానుంది. 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' అనేది ట్యాగ్‌లైన్. ఒక మొబైల్ గాడ్జెట్‌ని ఉపయోగించి టైమ్ ట్రావెల్ అయ్యి, తన ప్రియురాలిని చేరుకున్న ప్రియుడు కథతో ఈ సినిమా రూపొందుతున్నది. ఇందులో ప్రియురాలుగా 'ఉప్పెన' భామ కృతి శెట్టి నటిస్తుంటే, ప్రియుడి పాత్రను 'లవ్ టుడే' ఫేం ప్రదీప్ రంగనాథన్ పోషిస్తున్నారు. అగ్రనటి నయనతార ఈ సినిమాకు నిర్మాత కావడం విశేషం. ఆమె భర్త విగ్నేష్ శివన్ దర్శకుడు. అనిరుధ్ సంగీత దర్శకుడు. రీసెంట్‌గా కోలీవుడ్‌లో ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్‌లుక్‌ని విడుదల చేశారు. పింక్ కలర్ సోఫాలో పడుకొని, సిల్వర్ కలర్ స్కర్ట్‌లో స్టైలిష్‌గా కనిపిస్తున్న కృతిశెట్టి స్టిల్ ఇప్పుడు కోలీవుడ్‌లో చర్చనీయాంశమైంది. తెలుగులో ఆశించిన స్థాయిలో సక్సెస్‌లు లేకపోయినా.. కోలీవుడ్‌లో మాత్రం మంచి అవకాశాలనే దక్కించుకుంటున్నది కృతి శెట్టి.

ముచ్చటగా మూడోసారి

వైవిధ్యమైన కథల్ని ఎంచుకోవడంలో వెంకటేశ్ మాస్టర్. ప్రస్తుతం ఆయన అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఓ చిత్రం చేస్తున్న విషయం తెలిసిందే. క్రైమ్ జోనర్‌లో నడిచే కథతో రూపొందుతోన్న ఈ సినిమాలో మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేష్ కథానాయికలు. ఇదిలావుంటే.. తాజాగా మరో సినిమాకు వెంకీ పచ్చజెండా ఊపారని ఫిల్మ్‌వర్గాల టాక్. 'సామజవరగమన' చిత్రంతో రచయితగా గుర్తింపు తెచ్చుకున్న నందు కథకు వెంకీ ఓకే చేశారట. చిట్టూరి శ్రీనివాస్ ఈ చిత్రానికి నిర్మాత. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కనున్న ఈ సినిమాలో త్రిష కథానాయికగా నటించనున్నట్టు విశ్వసనీయ సమాచారం. దసరాకి ఈ సినిమా లాంఛనంగా ప్రారంభం కానున్నదని తెలుస్తున్నది. వెంకటేశ్, త్రిష ఇప్పటికే ఆడవారిమాటలకు అర్థాలువేరులే, నమో వేంకటేశా చిత్రాల్లో జంటగా నటించారు. ఇది వారిద్దరూ కలిసి నటించనున్న మూడో సినిమా అన్నమాట.

వెండితెరపై యూవీ బయోపిక్

భారత క్రికెట్ చరిత్రలో యువరాజ్‌సింగ్‌ది ఆదర్శవంతమైన అధ్యాయం. కష్టాల్లో ఉన్న టీమ్‌ను ఆపర్ఛాంధవుడిగా ఆయన ఆదుకున్న సందర్భాలు కోకొల్లలు. ఒకే ఓవర్‌లో ఆరు సిక్సర్‌లు కొట్టి ప్రత్యర్థులకు చుక్కలు చూపించిన చరిత్ర యువరాజ్ సింగ్‌ది. క్యాన్సర్‌తో పోరాడి గెలిచి, ఎంతోమందిలో మనోధైర్యాన్ని నింపారు యువరాజ్. ఆయన జీవితం ఓ పోరాటం. అందుకే త్వరలో ఆ జీవితం వెండితెరపైకి రానుంది. యువరాజ్‌సింగ్ బయోపిక్‌ని నిర్మించనున్నట్టు నిర్మాతలు భూషణ్‌కుమార్, రవిభాగ్ చందక్ ప్రకటించారు. త్వరలోనే ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలు తెలియజేస్తామని వారు చెప్పారు. ఈ ప్రకటన రాగానే.. ఇందులో యువరాజ్‌గా ఎవరు నటిస్తారు? అనే విషయంపై చర్చలు మొదలయ్యాయి. కొన్ని సోషల్‌మీడియా ప్లాట్‌ఫార్మ్‌లలో అయితే.. కొందరు హీరోల పేర్లు మెన్షన్ చేస్తూ, ఆడియన్ పోల్స్‌ని నిర్వహిస్తున్నారు. ఇంతకీ ఆ ఛాన్స్ దక్కించుకునే హీరో ఎవరో మరి.

అనుబంధాల 'ఉత్సవం'

దిలీప్‌ప్రకాష్, రెజీనా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'ఉత్సవం'. అర్జున్‌సాయి దర్శకుడు. సురేష్ పాటిల్ నిర్మాత. సెప్టెంబర్ 13న ప్రేక్షకుల ముందుకురానుంది. మంగళవారం ఈ సినిమా నుంచి 'మ్యారేజెస్ ఆర్ మేడిన్ హెవెన్' అనే గీతాన్ని విడుదల చేశారు. అనూప్‌రూబెన్స్ మెలోడీ ప్రధానంగా ఈ పాటను కంపోజ్ చేశారు. అనంత్‌శ్రీరామ్ రాసిన ఈ గీతాన్ని అర్మాన్ మాలిక్ ఆలపించాడు. ఈ పాటలో నాయకానాయికల కెమిస్ట్రీ ఆకట్టుకునేలా ఉంది. ఫీల్‌గుడ్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామని, వినోదం, కుటుంబ బంధాల కలబోతగా ఆకట్టుకుంటుందని మేకర్స్ తెలిపారు. ప్రకాష్‌రాజ్, నాజర్, రాజేంద్రప్రసాద్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: రసూల్ ఎల్లోర్, రచన-దర్శకత్వం: అర్జున్‌సాయి.

రాబరీ నేపథ్య కథాంశం

కృష్ణసాయి, మీనాక్షి జైస్వాల్ జంటగా నటిస్తున్న చిత్రం 'జ్యువెల్ థీఫ్'. పీఎస్ నారాయణ దర్శకత్వంలో మల్లెల ప్రభాకర్ నిర్మిస్తున్నారు. త్వరలో ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ చిత్ర టీజర్‌ను ఇటీవల నటుడు పృథ్వీ విడుదల చేశారు. తాను సూపర్‌స్టార్ కృష్ణ అభిమానినని, ఆయన స్ఫూర్తితోనే సినిమాల్లోకి వచ్చానని, సస్పెన్స్.. థ్రిల్లింగ్ అంశాలతో 'జ్యువెల్ థీఫ్' ఆకట్టుకుంటుందని హీరో తెలిపారు. కృష్ణసాయి నిజజీవితంలో కూడా హీరోనేనని, ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నాడని పృథ్వీ ప్రశంసించారు. సీనియర్ ఆర్టిస్టులు సినిమాలో నటించారని, భారీ స్థాయిలో విడుదల చేస్తామని నిర్మాత మల్లెల ప్రభాకర్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: ఎం.ఎం.శ్రీలేఖ.

కొత్త ప్రయాణానికి శ్రీకారం

'ఈ రోజు మీ అందరికీ ఓ సర్‌ప్రైజ్ ఇవ్వబోతున్నా' అంటూ మంగళవారం ఉదయం తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో అగ్ర కథానాయిక సమంత పెట్టిన పోస్ట్ అందరిలో ఆసక్తిని పెంచింది. వ్యక్తిగత జీవితానికి సంబంధించి లేదా కొత్త సినిమా తాలూకు విశేషాలను ఏమైనా వెల్లడిస్తుందేమోనని అభిమానులు ఆత్రుతగా ఎదురుచూశారు. అయితే అందరి ఊహలకు భిన్నంగా తాను ఓ స్పోర్ట్స్ ఫ్రాంచైజీలో భాగమైనట్లు తెలిపింది. టెన్నిస్, టేబుల్ టెన్నిస్‌ను పోలి ఉండే పికిల్‌బాల్ గేమ్‌కు అమెరికాలో మంచి ఆదరణ ఉంది. గతకొంతకాలంగా మనదేశంలో కూడా ఆదరణ లభిస్తున్నది. టెన్నిస్ తరహాలోనే సింగిల్స్, డబుల్స్‌లో ఈ ఆటను ఆడొచ్చు. వరల్డ్ పికిల్‌బాల్ లీగ్ చెన్నై ఫ్రాంచైజీని కొనుగోలు చేస్తున్నట్లు ప్రకటించిన సమంతా.. తన జీవితంలో ఇదొక కొత్త ప్రయాణమని ఆనందం వ్యక్తం చేసింది. 'న్యూ బిగినింగ్' అంటూ హ్యాష్‌ట్యాగ్‌ను జోడించింది. ప్రస్తుతం ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.